# అభివృద్ధికి కేరాఫ్ కేసీఆరే



గజ్వేల్‌లో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి

- సీఎం కేసీఆర్ గెలిస్తేనే గజ్వేల్ మరింత అభివృద్ధి
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్ అర్బన్, నవంబర్ 4 : అభివృద్ధికి కేరాఫ్ సీఎం కేసీఆర్ అని, ఆయన ఎక్కడ ప్రాతినిధ్యం వహిస్తే అక్కడ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని 20వ వార్డులో కొబ్బరికాయ కొట్టి బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ జిల్లా మహిళా విభాగం నాయకురాలు ఉమాదేవీగోపాల్‌రెడ్డి మహిళలకు బొట్టు పెట్టి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సిద్దిపేటకు ఎమ్మెల్యే కావడంతోనే అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు రెండుసార్లు గజ్వేల్‌కు ప్రాతినిధ్యం వహించడంతోనే చీకట్లో ఉన్న గజ్వేల్ వేలకోట్ల రూపాయల అభివృద్ధితో జిగేల్ మంటుందన్నారు. కేసీఆర్ ప్రాతినిధ్యంతో గజ్వేల్ అభివృద్ధి జరిగిందని పట్టణ, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలు ఆర్థికంగా బాగుపడ్డారన్నారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు కొండంత అండగా నిలిచాయని, ఇంటింటికీ వస్తున్న మిషన్‌భగీరథ నీటిలో సీఎం కేసీఆర్‌ను మహిళలు చూసుకుంటున్నారన్నారు. కేసీఆర్ పాలనలో గజ్వేల్ ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. బీసీవాదంతో వచ్చిన ఈటల కుటుంబంలో ఆయన తప్ప బీసీలెవరూ లేరన్నారు. ప్రజలను మోసం చేసే బూటకపు నాయకులను నమ్మవద్దని, అభివృద్ధి చేసే సీఎం కేసీఆర్‌నే మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, 20వ వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేశ్, వార్డు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్, కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ నిమ్మ రమేశ్, నాయకులు ఫరీద్, కాముని మురళి, మోచి ప్రభాకర్, బచ్చు ప్రకాశ్, సత్యనారాయణ, మసూద్, సత్యం, దేవేందర్, రాధాకృష్ణ నారాయణ, లీలావతి పాల్గొన్నారు.



20 వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జిల్లా మహిళా నాయకురాలు ఉమాదేవి గోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్



హుస్నాబాద్ ఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అబ్జర్వర్ వెంకదేశ్

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద
# ఏర్పాట్లు చేయాలి

- అభ్యర్థుల ప్రతి పైసా ఖర్చుకు రసీదు తీసుకోవాలి.. అభ్యర్థుల వివరాలు నమోదు చేయాలి
- ఎన్నికల నిర్వహణ టీం అధికారుల సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకదేశ్

హుస్నాబాద్, నవంబర్ 4: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకదేశ్ అధికారులకు సూచించారు. శనివారం హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6,9,14నంబరు పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందని, అందుకు సంబంధించిన సెక్టోరియల్ అధికారులు వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద నెలకొన్న ప్రతి అంశాన్ని సీసీటీవీ, వీడియో ద్వారా రికార్డు చేసి ఆర్వో కార్యాలయానికి పంపాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో చేస్తున్న ఖర్చును క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రతిపైసా ఖర్చును రసీదు తీసుకోవడం ద్వారా సదరు అభ్యర్థి పేరున ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన టీం అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు.

**అభ్యర్థి ఆదాయ వివరాలు తెలియజేయాలి**
**-బెన్‌షాలోమ్, రిటర్నింగ్ అధికారి**

ప్రతి అభ్యర్థి విధిగా తమ ఆదాయ వ్యయాలను అఫిడవిట్ ద్వారా తెలియజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బెన్‌షాలోమ్ అన్నారు. తనతోపాటు తన కుటుంబ సభ్యుల పేరున ఉన్న ఆస్తుల వివరాలు తెలుపాలన్నారు. నామినేషన్ వేసే ముందు రోజు కొత్త బ్యాంకు ఖాతా తీసి ప్రతి రూపాయి ఇదే ఖాతా నుంచి లావాదేవీలు జరిగేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్వో రవీందర్‌రెడ్డి, వివిధ టీంల అధికారులు పాల్గొన్నారు.

**నిబంధనల ప్రకారం నడుచుకోవాలి**

గజ్వేల్, నవంబర్ 4: ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన లెక్కల వివరాలను నిబంధనల ప్రకారం లెక్కించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు వివేక్ కుమార్ సిన్హా అన్నారు. ఈ సం దర్భంగా శనివారం గజ్వేల్ ఐవోసీ భవనంలో రిటర్నింగ్ అధికారి బన్సీలాల్, అసిస్టెంట్ ఆర్వో బాల్‌రాజుతో కలిసి ఎన్నికల విధుల్లో ఎగ్జిక్యూటివ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో రాజకీయ పార్టీల సమావేశాలు జరిగిన అక్కడికి వెళ్లి వివరాలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్వోలు పాల్గొన్నారు.

# మండలం ఏర్పాటుతోనే అభివృద్ధి



మర్కూక్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- రాష్ట్రానికే ఆదర్శం మర్కూక్
- కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు
- కేసీఆర్‌కు మద్దతుగా బైక్ ర్యాలీ
- ఎఫ్‌డీసీ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మర్కూక్, నవంబర్ 4 : మండలం ఏర్పాటుతోనే మర్కూక్ అభివృద్ధి సాధించి, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ఐదు జిల్లాలకు సాగునీరు అందించే కొండపోచమ్మ ప్రాజెక్టు మండలంలో నిర్మించడం మన అదృష్టమన్నారు. శనివారం మండలంలోని పాములపర్తి, మర్కూక్, బావానందాపూర్, శివారువెంకటాపూర్, దామరకుంట, కాశిరెడ్డిపల్లి, గ్రామాల్లో ప్రజాప్రతినిదులతో కలిసి కేసీఆర్‌కు మద్దతుగా బైక్ ర్యాలీగా వెళ్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, మరింత అభివృద్ధి చేయాలంటే కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో అమలు చేస్తామంటున్న పథకాలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎవరు కల్లబొల్లి మాటలు చెబుతున్నారో సంక్షేమ పథకాలను ఎవరు అమలు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. మూడు గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్ కావాలా.. 24 గంటల విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను గెలిపిస్తే రాష్ట్రంతోపాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతున్నదన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, కొందరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీలో చేరుతున్నారన్నారు. అంతకుముందు పాములపర్తి, అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మహిళలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ, హరిపంతులు, ఎంపీటీసీల ఫో రం అధ్యక్షుడు కృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి మేకల కనకయ్య, పిట్ల సత్యనారాయణ, కనకయ్య, కరుణాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



పాములపర్తిలో బీఆర్ఎస్ రోడ్డుషోకు హాజరైన జన ప్రభంజనం

# రెండోరోజు కొనసాగిన నామినేషన్ల పర్వం

సిద్దిపేట, నవంబర్ 4: సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి రెండోరోజు శనివారం నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆదికారి రమేశ్‌బాబు తెలిపారు. నామినేషన్లు వేసిన వారిలో స్వతంత్ర అభ్యర్థిగా సిద్దిపేట పట్టణానికి చెందిన పైసా రామకృష్ణ, మరో స్వతంత్ర అభ్యర్థి పిల్లి సాయికుమార్ తమ నామినేషన్ దాఖలు చేశారన్నారు.



దుబ్బాకలో ఆర్వో గరిమా అగర్వాల్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి భుజంగం

**హుస్నాబాద్‌లో ఒక నామినేషన్ దాఖలు**

హుస్నాబాద్, నవంబర్ 4 : హుస్నాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. మొదటిరోజు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండో రోజు శనివారం ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి బెన్‌షాలోమ్ తెలిపారు. కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కడితల అనిల్‌రెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా తన నామినేషన్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో రవీందర్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. నామినేషన్ల రెండోరోజు సీఐ ఎర్రల కిరణ్, ఎస్సై తోట మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించారు.

**దుబ్బాకలో మూడు..**

దుబ్బాక, నవంబర్ 4: దుబ్బాక అసెంబ్లీ స్థానానికి శనివారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని దుబ్బాక రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభం కాగా, మొదటి ఒక నామినేషన్ రాలేదు. రెండో రోజు శనివారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు తరపున ఆ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి గొంది భుజంగం నామినేషన్ సమర్పించారని, మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో తెలిపారు.